సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 21 । నవంబర్ । 2024



లక్ష గులాబీల అర్చన

జంగారెడ్డిగూడెం రూరల్: మద్ది క్షేత్రంలో బుధవారం స్వామికి లక్ష గులాబీలతో లక్షార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.



ఘనంగా క్షీరాధివాసం

తాడేపల్లిగూడెం రూరల్: కడియద్దలో పునర్నిర్మించిన గణపతి, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం విగ్రహాలకు క్షీరాధివాసం నిర్వహించారు.



గ్రామ పంచాయతీల పరిశీలన

పెదపాడు: జిల్లా పంచాయతీ అధికారి కె.అనూరాధ పెదపాడు, నాయుడుగూడెం, తోటగూడెం గ్రామ పంచాయతీలను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

రబీకి నీటి కష్టాలు?

- ఇరిగేషన్ కాల్వలు పూర్తిస్థాయిలో బాగుచేస్తామన్న ప్రభుత్వం
- ఒక్క అడుగూ ముందుకు పడని వైనం
- 11 ప్రధాన కాల్వల మరమ్మతులకు మోక్షం కలిగేనా?
- ఉమ్మడి పశ్చిమలో సుమారు రూ. 500 కోట్లతో ప్రతిపాదనలు
- ఏటా శివారు భూములకు అందని నీరు
- నేడు జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం



అత్తిలి మండలం గుమ్మంపాడు లాకుల వద్ద శిథిలావస్థకు చేరిన తలుపులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: చివరి ఎకరాకు నీరందాలి.. పశ్చిమ డెల్టాలోని 11 ప్రధాన కాల్వలు వాటికి అనుసంధానంగా ఉండే 300 ఉపకాల్వలు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి యుద్ధప్రాతిపదిక నిర్వహిస్తాం. భారీ తుపాన్లు, గోదావరికి వరదలు వచ్చినా ఇబ్బందులు లేకుండా చూస్తాం.. ఇది ప్రతి సమీక్షా సమావేశంలో, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు వరకూ అందరూ పదే పదే చెబుతున్న మాట. ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. ఇంకా ప్రతిపాదనలు, పరిశీలన దశల్లోనే డెల్టా మరమ్మతులు ఉన్నాయి. రబీ నీటి కష్టాలు, సాగునీటి ఇబ్బందులు, డెల్టా కాల్వల మరమ్మతులు ఇలా జలవనరుల శాఖలో ఎన్నో ఇబ్బందులున్నాయి. వీటన్నింటి నేపథ్యంలో గురువారం ఏలూరు జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించనున్నారు. రానున్న రబీ సీజన్‌కు నీటి విడుదల మరమ్మతులపై స్పష్టత ఇవ్వనున్నారు.

ఏలూరు జిల్లాకు 6 టీఎంసీలు అవసరం

ఏలూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లోని 29 మండలాల్లో గోదావరి పశ్చిమ డెల్టా 5,29,962 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీనిలో 4.60 లక్షల ఎకరాల వరిసాగు చేస్తున్నారు. ప్రధానంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 11 ప్రధాన కాల్వలు, 300 ఉప కాల్వల ద్వారా గోదావరి నుంచి సాగునీరు, తాగునీరు విడుదల చేస్తుంటారు. ఏటా సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించి ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగు విస్తీర్ణానికి అనుగుణంగా నీటి కేటాయింపులు, మరమ్మతులు నిర్వహించనున్న పనులపై ప్రజాప్రతినిధులకు జలవనరుల శాఖాధికారులు వివరిస్తారు. ఏలూరు జిల్లాలో 6 మండలాల్లో 82,251 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. ఏలూరు, దెందులూరు, భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, కైకలూరు మండలాల్లో డెల్టా విస్తీర్ణం 82,251 ఎకరాలకు 56,190 ఎకరాల్లో రబీ సీజన్‌లో వరి సాగు చేస్తారని అంచనా. ఈ క్రమంలో ఏలూరు జిల్లాకు సుమారు 6 టీఎంసీల నీటి అవసరం ఉంటుంది. అధికారిక లెక్కల ప్రకారం పోలవరంలో 14 టీఎంసీలు, సీలేరు కాంప్లెక్స్‌లో 44.59 టీఎంసీలు, గోదావరికి అదనంగా ఎగువ ప్రాంతాల నుంచి 9.45 టీఎంసీల వస్తుందనే అంచనా మొత్తం కలుపుకుని 68.40 టీఎంసీలు అందుబాటులో ఉంటాయి. పశ్చిమ డెల్టాలోని ఉభయగోదావరి జిల్లాల్లో 8.96 లక్షల ఎకరాల్లో తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఆయకట్టు విస్తరించి ఉంది. దీనికి 91.350 టీఎంసీల నీరు అవసరం. సాగునీటితో పాటు తాగునీరు కూడా గోదావరి నుంచి వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో సుమారు 22 టీఎంసీల నీటి కొరత ఉన్నట్లు అధికారులు నివేదించారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు అకాల వర్షాలతో గోదావరిలో చేరే నీటితో కొంతమేర పరిస్థితి అధిగమించవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రతిపాదనలు ముందుకు సాగేనా?

జిల్లాలో రూ.1.74 కోట్లతో 7 కాల్వల పనులు, రూ.3.70 కోట్లతో 14 డ్రెయిన్ల పనులు మంజూరయ్యాయి. అవి ఇంకా ఖరారు దశలో ఉండి ముందడుగు పడటం లేదు. ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు నియోజకవర్గాల్లోని 6 మండలాల్లో ఈ పనులున్నాయి. రూ.5.27 కోట్లతో మరో 25 పనులు ఖరారు చేసినప్పటికీ అవి కూడా టెండర్ల దశకు చేరలేదు. ఇవి కాకుండా ఏలూరు జిల్లాలో 67 పనులను రూ.167 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు రెండు నెలల క్రితం ప్రభుత్వానికి పంపారు. అది కూడా ఖరారు కాని పరిస్థితి. సాగునీటి సలహా మండలి సమావేశంలో అభివృద్ధిపనుల పైనే కీలక చర్చ సాగనుంది. గత ఖరీఫ్ సీజన్‌లో మూడు పర్యాయాలు వరదలు, భారీ తుఫాన్లతో జిల్లాలో 29 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. దీంతో రైతుకు పెట్టుబడి ఎక్కువై ఇబ్బంది పడ్డాడు. ఈ సారి రబీలో మంచి దిగుబడిపై అనేక ఆశలు పెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో అనేక ప్రతికూల పరిస్థితుల నడుమ సాగు కొనసాగుతుంది. రబీ సీజన్‌లో పూర్తిగా కాల్వలపైనే ఆధారపడి సాగు నిర్వహించాల్సిన క్రమంలో నీటి ఇబ్బందులపైనే సాగు నీటి సలహామండలి సమావేశంలో చర్చ సాగుతుంది. వంతుల వారీ విధానం ద్వారా శివారు భూములకు నీరందని పరిస్థితి. వచ్చే ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 1 వరకు సాగునీటి కాల్వల్లో నీటిని నిలిపివేస్తామని ప్రకటించారు. ఈ సమయంలోనే మరమ్మతులు, పూడికతీత నిర్వహించాల్సి ఉంది.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



విస్సాకోడేరు లేఅవుట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

పాలకోడేరు: పాలకోడేరు మండలం విస్సాకోడేరు హౌసింగు లేవుట్‌ను కలెక్టరు చదలవాడ నాగరాణి తనిఖీ చేశారు. కాలనీలో వర్షం వస్తే జలమయం అవుతుందని, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు నిర్మించాలని మహిళలు కలెక్టరును కోరారు. కలెక్టరు స్పందిస్తూ దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తామని, ముందు ప్రాధాన్యత క్రమంలో తాగునీటి సమస్యను పరిష్కరించి, స్వచ్ఛమైన తాగునీరును రెండు పూటల అందిస్తామని తెలిపారు. విస్సాకోడేరు ఫోరు నెంబరు పేట హౌసింగు లేవుట్‌లో మొత్తం 96 ప్లాట్లు మంజూరు కాగా, వాటిలో 39 నిర్మాణాలు పూర్తయ్యాయని, గృహ ప్రవేశాలు చేసుకుని ఉంటున్నారని, గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జ్ పీడీ జి.పిచ్చియ్య కలెక్టరుకు తెలిపారు. తాగునీటి పనులు పూర్తి చేసేందుకు జల జీవన మిషన్ ద్వారా రూ.5 లక్షలు మంజూరు చేయాలని సర్పంచ్ బొల్ల శ్రీనివాసు కలెక్టరును కోరారు. కలెక్టరు స్పందిస్తూ తాగునీరు అందించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ దశలో ఉన్న గృహాలను మార్చి 31 కల్లా పూర్తి చేసి నూరుశాతం లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించాలని కలెక్టరు ఆదేశించారు. మండల స్పెషల్ ఆఫీసర్ ఆర్‌వీఎస్‌వీ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మహిళల రక్షణ కోసం రక్షక్ టీమ్



భీమవరంలో రక్షక్ టీంను ప్రారంభిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ

భీమవరం: మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా మహిళా రక్షక్ టీంను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. బుధవారం భీమవరంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం వద్ద రక్షక్ టీంను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని మహిళలు, చిన్నారులు, విద్యార్థినుల రక్షణ, భద్రతే రక్షక్ టీమ్ ప్రధాన ధ్యేయమన్నారు. రక్షక్ వాహనం ద్వారా మహిళా పోలీసు సిబ్బంది కళాశాలలు, పాఠశాలలు, బస్టాండ్స్, రైల్వే స్టేషన్స్ ఇతర ప్రభుత్వ స్థలాల్లో గస్తీ తిరుగుతూ ఉంటారని, 112 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా ఏదైనా ఫిర్యాదు అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని అవసరమైన చర్యలు చేపడతారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) వి.భీమారావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం



భీమవరం కెనరా బ్యాంక్ కార్యాలయంలో రక్తదాన శిబిరం

భీమవరం : కెనరా బ్యాంక్ 119 వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం భీమవరం కెనరా బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ సర్కిల్ ఆఫీస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బీఎస్ అనంత పద్మారావు మాట్లాడుతూ బ్యాంక్‌ను అభివృద్ధి చేయడంతోపాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా భీమవరం, రాజమహేంద్రవరంలో రక్తదాన శిబిరాల నిర్వహణతోపాటు తణుకులోని వృద్ధాశ్రమానికి రూ.50 వేలు విలువైన సామగ్రి అందించామని తెలిపారు. అనంతరం పలువురు ఖాతాదారులను సత్కరించారు.

విద్యతోనే విజ్ఞానం



మాట్లాడుతున్న రిటైర్డ్ డీజీఎం ఆర్‌సీవీ రాజు

నరసాపురం రూరల్: విద్యతోనే విద్యార్థులకు విజ్ఞానం, ఉపాధి అవకాశాలు లభిస్తాయని సింగరేణి కాలరీస్ రిటైర్డ్ డీజీఎం ఆర్‌సీవీ రాజు అన్నారు. బుధవారం నరసాపురం మండలం లక్ష్మణేశ్వరంలోని ఫిషరీస్ కళాశాలలో 2024–2025 విద్యా సంవత్సరానికి సంబంధించి బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ కోర్సుకు సంబంధించి తరగతులు ప్రారంభమయ్యాయి. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ టి.నీరజ ఆధ్వర్యంలో ఓరియంటేషన్ ప్రోగ్రాం జరిగింది. అడ్మిషన్లు పొందిన 63 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన రాజు మాట్లాడుతూ ఫిషరీస్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తున్నాయన్నారు.

రూ.20.25 లక్షల సెల్‌ఫోన్ల రికవరీ



బాధితులకు సెల్‌ఫోన్లు అందిస్తున్న ఎస్పీ

భీమవరం: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందించడానికి పోలీసు సిబ్బంది చేస్తోన్న కృషి అభినందనీయమని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఇటీవల రికవరీ చేసిన రూ.20.25 లక్షల విలువైన 135 సెల్ ఫోన్లను బాధితులకు అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇప్పటి వరకు సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న 3,865 మంది సెల్ చాట్‌బాక్స్ నంబర్‌కు ఫిర్యాదు చేయగా, వాటిలో 1,239 ఫోన్లు రికవరీ చేశామని, వీటి విలువల దాదాపు రూ.1.86 కోట్లు ఉంటుందని చెప్పారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకుంటే ఫోన్ నెంబర్ 91549 66503 ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు.

సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించాలి



ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ పథకంలో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలపై సోలార్ విద్యుత్ ఏర్పాటుకు సర్వే నిర్వహించి ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు. దరఖాస్తులను నెడ్‌క్యాప్ త్వరగా ఆమోదించాలని తెలిపారు. మార్గదర్శకాలు అనుసరించి ఐదువేల జనాభా పైబడిన ఐదు గ్రామాలను ప్రాథమికంగా గుర్తించామని భీమవరం మండలం వెంప, పెంటపాడు మండలం అలంపురం, పాలకోడేరు మండలం పాలకోడేరు, తణుకు మండలం తేతలి, పాలకొల్లు మండలం అగర్తపాలెం, ఎస్.చిక్కాల ఉన్నాయన్నారు. ఎంపిక చేసిన గ్రామాలలో ఎక్కువ శాతం సోలార్ ఏర్పాటు చేసుకున్న గ్రామాన్ని గుర్తించి రూ.కోటి నిధులను పంచాయతీకి ఇస్తామన్నారు. అనంతరం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ప్రచార గోడ ప్రతిని, కరపత్రాన్ని కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, విద్యుత్ శాఖ అధికారి ఆలపాటి రఘునాథ్‌బాబు, నెట్ క్యాంప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ హరీష్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఏ.నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక విద్యాపీఠంలో చేరేందుకు 25 వరకూ గడువు

భీమవరం: ప్రస్తుత విద్యాసంవత్సరంలో టెన్త్, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశం పొందడానికి తత్కాల్ స్కీంలో ఈనెల 25 వరకు గడువు ఉన్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠానికి సంబంధించి తత్కాల్ స్కీంలో రూ.600 అపరాధ రుసుంతో టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు పొందడానికి అవకాశం ఉందని వివరించారు. దీనికి 14 ఏళ్ల వయసు నిండి బడి బయట ఉన్నవారికి చదువుకోనికి ఇదే ఆఖరి అవకాశమని నారాయణ తెలిపారు.

గళమెత్తిన వీఓఏలు



భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వీఓఏలు

భీమవరం(ప్రకాశం చౌక్): తమ సమస్యలను పరిష్కారించాలని జిల్లాలోని వీఓఏలు (డ్వాక్రా) కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ధర్నా నిర్వహించి అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ కూటమి నాయకులు కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిందని, అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీఓఏల మూడేళ్ల కాలపరిమితి ఉత్తర్వులు రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయిల వేతనాలు చెల్లించాలని, అక్రమంగా విధుల నుంచి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలన్నారు. నాలుగు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, మహిళా మార్ట్‌ల్లో బలవంతపు సరుకుల కొనుగోలు ఆపాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలన్నారు.

అర్ధరాత్రి అక్రమ తవ్వకాలు



పెనుగొండ మండలం నడిపూడిలో రాత్రి వేళ ఇసుక అక్రమ తవ్వకాలు

పెనుగొండ: పశ్చిమగోదావరి జిల్లాలోని ఇసుక ర్యాంపులు సీఆర్‌జెడ్ పరిధిలోకి రావడంతో ఇసుక తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేకపోయినా రాత్రయితే చాలు కూటమి నాయకులు తోడేస్తున్నారు. పెనుగొండ మండలం నడిపూడి ఇసుక ర్యాంపులో బుధవారం రాత్రి పక్క నియోజకవర్గం నుంచి వచ్చిన కూటమి నాయకుడు దర్జాగా ఇసుక అక్రమ రవాణాను ప్రారంభించేశారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రధాన ఇసుక ర్యాంపులైన సిద్ధాంతం, కోడేరు, కరుగోరుమిల్లి, నడిపూడి దిగువ ప్రాంతాల్లోని ర్యాంపులన్నీ సముద్రపు నీటి పోటు వల్ల ఉప్పుతో ఇసుక కలుషితమైందంటూ ర్యాంపులకు అనుమతులు లభించలేదు. జిల్లా వాసులకు ఇసుక అందుబాటులోకి తేవాలన్న ఉద్దేశంతో తీపర్రు 2, 3, ఔరంగాబాద్ ర్యాంపులను జిల్లాకు కేటాయించారు. అయినా ఇసుక అందుబాటులోకి రాలేదు. ఆయా ర్యాంపుల్లో స్థానికులకే ఇసుక తీసుకోవడానికి ఆయా ప్రాంతాల కూటమి నాయకులు ప్రాధాన్యత ఇవ్వడంతో ఇసుక బంగారంగా మారింది. ఇదే అవకాశంగా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఓ నియోజక వర్గానికి చెందిన నేత చక్రం తిప్పి బాటలు వేసి ఇసుక తవ్వకాలు ప్రారంభించేశారు. దీంతో అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడం లేదు. అనుమతులు లేకపోయినా తవ్వకాలు జరిపేస్తున్నారు.

అర్ధరాత్రి వేళ రగడ : లారీలకు మాత్రమే ఎగుమతులు చేస్తుండడంతో ట్రాక్టర్ల యజమానులు తమకు లోడింగ్ చేయాలంటూ ఆందోళన చేయడంతో గంట పాటు తవ్వకాలు నిలిచిపోయాయి. అనంతరం వాటికీ ఎగుమతులు ప్రారంభించారు. నడిపూడిలో ఇసుక తవ్వకాలు ప్రారంభిస్తున్నామని, లోడింగ్ రూ.2500 అంటూ కొందరు సోషల్ మీడియాలో అత్యుత్సాహం ప్రదర్శించారు. మూడు యూనిట్లు లారీకి రూ.3000, అయిదు యూనిట్లు లారీకి రూ.5 వేలు వసూలు చేస్తున్నట్లు వాహన దారులు తెలిపారు. పక్క నియోజకవర్గం నుంచి వచ్చి అక్రమంగా ఇసుక తవ్వకొని వెళ్లిపోతుండడం స్థానిక కూటమి నాయకులకు మింగుడు పడడం లేదు. అనుమతులు లేకుండా ఎలా తవ్వకాలు ప్రారంభిస్తారంటూ అధికారులకు సమాచారం ఇచ్చి ర్యాంపు నిలుదలకు ప్రయత్నించడం కొసమెరుపు.

మత్స్యకార భరోసాకు మంగళం

- ఈ ఏడాది లేనట్టుగా అసెంబ్లీలో మంత్రి ప్రకటన
- వరుస ప్రకృతి విపత్తులు, అందని ప్రభుత్వ సాయం
- గంగపుత్రులకు అండగా నిలిచిన జగన్ ప్రభుత్వం
- నేడు ప్రపంచ మత్స్యకార దినోత్సవం



సముద్రంలో వేట సాగిస్తున్న మత్స్యకారులు(ఫైల్)

నరసాపురం: జగన్ సర్కార్ హయాంలో వేట నిషేధ సమయంలో అందించే మత్స్యకార భరోసా సొమ్ము టంచన్‌గా మే నెలలోనే బ్యాంకు ఖాతాల్లో జమయ్యేది. ఈ పథకానికి కూటమి ప్రభుత్వం ఈ ఏడాది మంగళం పాడనుంది. తాము అధికారంలోకి వస్తే మత్స్యకార భరోసా రూ.10 వేలు నుంచి రూ.20 వేలుకు పెంచుతామని వాగ్దానం చేసిన కూటమి నాయకులు చేతులెత్తేశారు. ఈ ఏడాది మత్స్యకార భరోసా ఇవ్వమని, సర్వేచేసి అర్హులను గుర్తించి ఆలోచిస్తామని స్వయంగా వ్యసాయశాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు అసెంబ్లీలో మంగళవారం చేసిన ప్రకటన గంగపుత్రులపై పిడుగుపడ్డట్టైంది. గత ఏడు నెలల నుంచి ఆశగా చూస్తున్న వేటకారుల కుటుంబాలపై కూటమి సర్కార్ కరుణ చూపించడంలేదని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. నవంబర్ 21వ తేదీన ప్రపంచ మత్స్యకార దినోత్సవం. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం తీరప్రాంతం ఉన్న జిల్లాల్లో అధికారికంగా నిర్వహించేది. ప్రస్తుతం ప్రపంచ మత్స్యకార దినోత్సవం వేళ మత్స్యకార భరోసా సాయం రాదనే వార్త వినడాన్ని గంగపుత్రులు జీర్ణించుకోలేకపోతున్నారు.

జగన్ హయాంలో ముందుగానే భరోసా

2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వేట సాగించే మత్స్యకారుల సంక్షేమంపై నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టి పెట్టారు. ఏటా వేట నిషేధ సమయంలో అందించే సాయాన్ని రెండున్నర రెట్టు పెంచడంతోపాటు లబ్ధిదారుల సంఖ్యను భారీగా పెంచారు. ఏటా ముందుగానే మే నెలలోనే మత్స్యకార భరోసా అందించేవారు. 176 మంది ఉన్న లబ్ధిదారుల సంఖ్యను 1072కు పెంచి రూ.10 వేలు చొప్పున అందించారు. వైఎస్సార్ సీపీ హయాంకు ముందు వేట నిషేధ కాలం ముగిసి, మళ్లీ జూన్‌లో వేట ప్రాంభమైన తరువాత ఐదారు నెలలు తరువాత సాయం అందించేవారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 19 కిలో మీటర్లు మేర తీరప్రాంతం ఉన్న నరసాపురంలో దాదాపుగా రెండు వేల మంది వరకు పూర్తిగా వేటనే నమ్ముకుని బతుకుతున్నారు. చేపల పునరుత్పత్తి సీజన్ కావడంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సముద్రంలో వేట నిషేధం అమలు చేస్తుంది. ఏటా ఏప్రిల్ 14వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు అమల్లో ఉంటుంది. ఈ 61 రోజులు మత్స్యకారులు ఖాళీగా ఉంటారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఐదేళ్లలో 6,427 మందికి రూ.7.87 కోట్లు మత్స్యకార భరోసా సాయం అందించారు.

నష్టాల్లో వేట : ఈ ఏడాది మత్స్యకారులకు అస్సలు కలిసిరాలేదు. జూన్ 15వ తేదీ నుంచి వేట ప్రాంభించిన మత్స్యకారులకు ప్రకృతి విపత్తులు నడ్డి విరిశాయి. జూన్, జూలై, ఆగస్ట్ నెలల్లో వరుస తుఫాన్‌లు వెంబడింటాయి. దీంతో మత్స్యకారులు బోట్లకు గట్టువద్దనే లంగర్లు వేయాల్సిన పరిస్థితి. డీజిల్ రేటు కూడా రూ.98లకు చేరడం, ఐస్ ధరలు పెరగడంతో పెట్టుబడులు పెరగడం కూడా నష్టాలను చవిచూశారు. మరోవైపు ప్రభుత్వం నుంచి పైసా కూడా సాయం లేకపోవడంతో మత్స్యకారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. నరసాపురం తీరంలో విశాఖ, నెల్లూరు, కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన 150 వరకు బోట్లలో ప్రతిరోజూ వేట సాగిస్తారు. ఏడాదికి రూ.300 కోట్ల మత్స్యసంపద ఎగుమతి అవుతుంటుంది. ప్రస్తుతం దారుణ నష్టాలు చూస్తున్నామని మత్స్యకారులు చెబుతున్నారు. 2014–19 మధ్యకాలంలో కూడా చంద్రబాబు సర్కార్ మత్స్యకారుల విషయంలో కర్కసంగా వ్యవహరించింది. వేట నిషేధ సమయంలో సాయాన్ని ఏడిపించి, ఏడిపించి ఇచ్చేవారు. అదీ ఎన్నికల దగ్గపడుతున్న సమయంలో రూ.4 వేలకు పెంచి ఇచ్చారు. అదీ లబ్ధిదారుల సంఖ్యను బాగా కుదించి, నామమాత్రంగా ఇచ్చేవారు. వేటనిషేధం గడువు ముగిసి సముద్రంలో గత జూన్ 15వ తేదీన వేట ప్రారంభమైంది. అప్పటి నుంచి ప్రభుత్వ సాయం కోసం మత్స్యకారులు ఎదురు చూస్తునే ఉన్నారు.


మత్స్యకార భరోసాతో ఆదుకున్న జగన్ సర్కార్

సంవత్సరం	లబ్ధిదారులు	సాయం (రూ.లో)
2019	1072	1.072 కోట్లు
2020	1092	1.092 కోట్లు
2021	1200	1.20 కోట్లు
2022	1400	1.40 కోట్లు
2023	1635	1.63 కోట్లు

గతంలో టీడీపీ హయంలో..

సంవత్సరం	లబ్ధిదారులు	సాయం (రూ.లో)
2014	–	–
2015	52	1.04 లక్షలు
2016	46	0.92 లక్షలు
2017	104	4.1 లక్షలు
2018	176	6.92 లక్షలు

మత్స్యకారులంటే చిన్నచూపు



మత్స్యకారులంటే కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు చిన్నచూపు. 2014–19 మధ్యకాలంలోనూ మత్స్యకారులకు ఎలాంటి సాయం చేయలేదు. పథకాలు సవ్యంగా అందివ్వలేదు. జగన్ హయాంలో మత్స్యకార భరోసా రూ.10 వేలకు పెంచి సకాలంలో అందించారు. డీజిల్ సబ్సిడీ రూ.9కి పెంచారు. దీంతో వేట ఖర్చులు తగ్గి లాభాలు అధికంగా వచ్చేవి. వేటసాగిస్తూ మృతిచెందిన గంగపుత్రులకు రూ.10 లక్షలు అందించారు. జగన్ మత్స్యకార భరోసా తప్ప ఇంకేం చేయలేదని అసెంబ్లీలో అచ్చెన్నాయుడు చెప్పడం అబద్ధం. మత్స్యకార భరోసా రూ.20 వేలు వెంటనే అందించి హామీ నిలబెట్టుకోవాలి.

– తిరుమాని నాగరాజు, వైఎస్సార్ సీపీ మత్స్యకార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు

సాయం లేకపోవడం దారుణం



ప్రభుత్వం మత్స్యకార భరోసా సాయం ఇవ్వకపోవడం దారుణం. జగన్ సర్కార్ మాకు ఏడాదికి రూ.10 వేలు చొప్పున వేట నిషేధం సాయం అందించారు. ఏటా మే నెలలోనే సొమ్ములు మా ఖాతాల్లో పడేవి. వేటను నమ్ముకుని జీవించే మాకు కూటమి ప్రభుత్వం సాయం చేయకపోవడం సరికాదు.

– తిరుమాని ఏడుకొండలు, వేట కార్మికుడు, నరసాపురం

ఐదేళ్లు ఇబ్బంది తెలియలేదు



జగన్ హయాంలో వేట లేని సమయంలో ఇబ్బంది తెలియలేదు. పెద్ద బోటు, చిన్న, చిన్న చెక్క నావలపై వేట సాగించుకునే వారికీ రూ.10 వేలు సాయం జగన్ అందించారు. ఈ ఏడాది వేట నిసేధ సమయంలో డబ్బులు లేక పస్తులున్నాం. మాకు సముద్రంలో వేట తప్ప మరో పని తెలియదు.

– తిరుమాని ఏసుబాబు, వేములదీవి, కార్మికుడు

క్లుప్తంగా

బాలల సంరక్షణ అందరి బాధ్యత

తాడేపల్లిగూడెం (టీఓసీ): బాలల సంరక్షణ అందరి బాధ్యత అని భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బి.జ్యోతి, ఫిజియోథెరపి డాక్టర్ అల్లు శ్రీకృష్ణ మహేష్‌లు పేర్కొన్నారు. భవిత సెంటర్‌లో బుధవారం బాలల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని, నార్మల్ పిల్లలకు ప్రభుత్వం విద్యా హక్కు, ఇతర హక్కులను కల్పించిందని, దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధిపై అప్రమత్తంగా ఉండండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మధుమేహ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, యోగా గురువు కరిబండి రామకృష్ణలు పేర్కొన్నారు. షుగర్ టెస్ట్ శిబిరం క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఉమర్ ఆలీషా జ్ఞాన మందిరంలో నిర్వహించారు. మధుమేహ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని, యోగ నడక, శారీరక వ్యాయామం చేయాలని సూచనలు చేశారు. షుగర్ వ్యాధి- తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంధి అపర్ణ వర ప్రసాద్, యోగా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తణుకు అర్బన్: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) జిల్లా నాయకులు కె.సూకరాజు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం తణుకు ఆర్టీసీ డిపో ఆవరణలో ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు పనిభారం తగ్గించాలని, కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, పదవీ విరమణ అయిన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు టీవీఎస్ మూర్తి, తణుకు శాఖ అధ్యక్షులు ఎ.ప్రసాద్, కార్యదర్శి ఎస్.శ్రీనివాసు, సీఐటీయూ నాయకులు కామన మునిస్వామి, ఆర్‌వీ దుర్గారావు, టీవీఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కానరాని 'కోడ్'



జట్లపాలెంలో జనసేన ప్రచార బ్యానర్

పెంటపాడు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమలులో ఉంది. ఈ క్రమంలో రాజకీయ నాయకుల ఫొటోలకు అధికారులు ముసుగులు వేయాల్సి ఉంది. మండలంలోని కొన్ని గ్రామాల్లో ప్రధానం జట్లపాలెం గ్రామంలో అధికార పార్టీకి చెందిన నాయకులు బ్యానర్లు ఉన్నా, వాటిని తొలగించడంలో అధికారులు విఫలం చెందారు. జిల్లా వ్యాప్తంగా కోడ్ అమలవుతున్న దాఖలాలు కానరావడం లేదు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలతో కూడిన స్వాగతం బోర్డులపై ముసుగులు వేయడం లేదా ఫ్లెక్సీలను తొలగించిన దాఖలాలు కానరాలేదు.

సేవలు వెలవెల!

- సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- మొరాయిస్తున్న సర్వర్లు.. తెరుచుకోని వెబ్‌సైట్లు
- సేవలు అందక ప్రజలకు తప్పని ఇక్కట్లు



ఇరగవరంలో గ్రామ సచివాలయం

ఇరగవరం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన గ్రామ, వార్డు సచివాలయాలు ఒకప్పుడు కళకళలాడుతుండేవి. ఏ పథకం వర్తించాలన్నా.. ఏపని పూర్తి కావాలన్నా సంబంధిత సచివాలయ సిబ్బందికి వద్దకు వెళ్తే క్షణాల్లో పని జరిగేది. కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయాలు వెలవెలబోతున్నాయి. పూర్తిస్థాయిలో సిబ్బంది ఉంటున్నా సాంకేతిక కారణాలతో ఏ పనీ జరగని పరిస్థితి నెలకొంది.

గతమెంతో ఘనం

గ్రామస్వరాజ్యమే లక్ష్యంగా గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు వేలు జనాభా దాటిన ప్రతి పంచాయతీలోనూ సచివాలయం ఏర్పాటు చేశారు. దానిలో వివిధ శాఖలకు సంబంధించి ఉద్యోగులను నియమించారు. గ్రామస్తులకు అవసరమైన ప్రతి పనీ అక్కడే జరిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో సచివాలయం వ్యవస్థ ఎంతో విజయవంతమైంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా సచివాలయ వ్యవస్థ నిర్వీర్యమవుతోంది.

తెరుచుకోని వెబ్‌సైట్లు

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడుస్తున్నా సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు సక్రమంగా సేవలు అందడం లేదు. రేషన్ కార్డుల నమోదు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ, కార్డు సేవలు, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ వంటి వెబ్‌సైట్లలో నమోదు కావడం లేదు. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను కుదేలు చేసిన కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేస్తోంది. కేవలం కుల ఆదాయ ధ్రువపత్రాలు, వన్‌బీలు తప్ప ఇతర ముఖ్యమైన సేవలు అందకపోవడంతో సచివాలయాలకు వెళ్తున్న సామాన్య ప్రజలు ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. మరో వైపు గత ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థపైనా, ఆశాఖలో పనిచేసిన ఉద్యోగులపైనా కూటమి నాయకులు నానా విమర్శలు చేసేవారు. నేడు వారితోనే సామాజిక పింఛన్ల పంపిణీతో పాటు ఇటీవల ఇది మంచి ప్రభుత్వ పాలన అంటూ స్టిక్కర్లను ఇంటింటికీ అంటించే బాధ్యత కూడా సచివాలయ ఉద్యోగులకే కట్టబెట్టారు. కార్యాలయంలో ముఖ్యమైన పనులు వదిలేసి ఇలాంటివి తమతో చేయించడం తగదని పలువురు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెనక్కి వచ్చేశా..



నేను ఇటీవల అనారోగ్యానికి గురయ్యాను. ఆస్పత్రికి వెళ్లే ఆరోగ్యశ్రీ కార్డులో పేరులో తప్పు ఉందని సచివాలయంలో సరిచేసుకొని రావాలని హస్పిటల్ సిబ్బంది చెప్పారు. వెంటనే సచివాలయానికి వెళ్లాను. అపక్కడ వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని సిబ్బంది చెప్పడంతో వెనక్కి వచ్చేశాను. డబ్బులు చెల్లించి చికిత్స చేయించుకోవాల్సి వచ్చింది.

తామరపల్లి ముసలయ్య, పద్దిరెడ్డిపాలెం

పుస్తక పఠనంతో మేధో వికాసం

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

తణుకు అర్బన్: పుస్తక పఠనంతో మేధో వికాసం సాధ్యమని పలువురు వక్తలు పేర్కొన్నారు. 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు విద్యార్థులు అత్యధికంగా బహుమతులు సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం కె.పద్మావతి చెప్పారు. పాటలు, పేపర్ క్రాఫ్ట్, వ్యాసరచన, డ్రాయింగ్, కథల పోటీల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన చూపించి ప్రశంసాపత్రాలు, బహుమతులు సాధించినట్లు వివరించారు. విద్యార్థులతోపాటు విద్యార్థులను తీర్చిదిద్దిన డ్రాయింగ్ టీచర్ చింతపల్లి దుర్గాప్రసాద్‌ను హెచ్‌ఎం పద్మావతి, స్కూలు స్టాఫ్ సెక్రటరీ జీజే ప్రభువరం, ఉపాధ్యాయులు వీరభద్రరావు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

తణుకు టౌన్: విద్యార్థులు విజ్ఞానంతో పాటు పఠనా శక్తిని పెంపొందించుకోవాలని మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు చెప్పారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా పట్టణంలోని బుధవారం వివిధ పోటీలలో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. మానవత జిల్లా కన్వీనర్ ఎస్వీ సతీష్ బాబు, తణుకు శాఖ కార్యదర్శి బీ రామకాశీ, కౌరు వెంకటేశ్వర్లు, పీ శివన్నారాయణ, డాక్టర్ బీ రామలక్ష్మీ, జీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. తణుకు మహిళా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వేల్పూరు గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ ఎంఈవో కోరా సత్యనారాయణ, పుట్టా సత్యనారాయణ, కేఆర్ చక్రధర్, బసవయ్య, కానూరి బదరీనాథ్, ముత్యాల రుద్రయ్య, ఆర్ సీతారామదాసు, గ్రంథాలయ అధికారి సాయిబాబా ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీవైఈఓ ఎస్.రవీంద్రభారతి, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.సత్యనారాయణ, పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజర్ పి.కాంతరావు పేర్కొన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం బుధవారం గ్రంథాలయాధికారి వి.శ్రీనివాస్ రావు పర్యవేక్షణలో నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉన్న వివిధ పుస్తకాలను తప్పక చదవాలని, జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వివిధ పోటీలలో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. గరికపాటి బాపయ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.



తణుకు అర్బన్: ప్రశంసాపత్రాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు



తణుకు టౌన్: విద్యార్థినులకు బహుమతులు అందజేసిన దృశ్యం



పెంటపాడు: విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం చేస్తున్న దృశ్యం



అత్తిలి: శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు బహుమతి ప్రదానం

అత్తిలి: విద్యార్థులు గ్రంథాలయాలలో లభించే విలువైన పుస్తకాలను పఠించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రిటైర్డు గ్రంథపాలకుడు గంధం శేషవేంద్రరావు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సందర్భంగా బుధవారం అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థి దశ ఎంతో విలువైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయిని పి శ్రీతల్లి, రిటైర్డు ఉపాధ్యాయుడు కె గాబ్రియేల్‌జాన్, అమర్ ఆర్ట్స్ అకాడమి అధినేత అమర్, ఆర్ దానకృష్ణ, గ్రంథాలయాధికారి డి కృష్ణారావు పాల్గొన్నారు. ఆరవల్లి శాఖా గ్రంథాలయంలో 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సభ బుధవారం జరిగింది. సభకు హాజరైన పాఠశాల హెచ్‌ఎం అనంతలక్ష్మి పోటీలలో విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యవతి, సూర్యనారాయణ, అడ్వొకేట్ ఎస్ఎస్ రెడ్డి, అమృతరావు, గ్రంథాలయాధికారి సత్తి శ్రీనివాసరెడ్డి, బులివెంకటరెడ్డి, శ్రీనివాస్, లావణ్య , కృష్ణకుమారి పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

పెంటపాడు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని పలువురు వక్తలు కొనియాడారు. మండలంలోని శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా పర్యావరణ పరిరక్షణ అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు ఆధ్వర్యంలో గ్రంథాలయాధికారి జుల్ఫికర్‌ఆలీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత సభ్యులు తారాడి పాల్, యశ్వంత్ కుమార్, డాక్టర్ బాను సత్యనారాయణ, సత్తారు రాము, విశాలి, పాలిమాటి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించాలి



దంతుపల్లిలో ధాన్యం విక్రయంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ రాజేష్

అత్తిలి: రైతులు తమ ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయించి ధాన్యానికి మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయశాఖాధికారి టీకే రాజేష్ చెప్పారు. బుధవారం అత్తిలి మండలం దంతుపల్లి, ఉనికిలి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏఓ రాజేష్ మాట్లాడుతూ రైతులు తమకు నచ్చిన మిల్లుకి ధాన్యం తరలించే వెసులుబాటు ఉందన్నారు. మండలంలో 20 రైతు భరోసా కేంద్రాలలో ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. రైతులు ధాన్యం అమ్మిన 48 గంటల్లో రైతుకు నగదు జమ చేయబడుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రతి కేంద్రంలో టెక్నికల్ అసిస్టెంట్, డీఈఓ, హెల్పర్ అందుబాటులో ఉంటారన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గోనె సంచులు ముందస్తుగానే ఏర్పాటు చేసామని తెలిపారు. రైతులకు ఏవిధమైన సందేహాలు ఉంటే రైతు భరోసా కేంద్రం ఇన్‌చార్జ్ లేదా వీఆర్వోను, మండలస్థాయిలో ఏఓ, తహసీల్దార్‌ను సంప్రదించాలని కోరారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి



చలో విజయవాడ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రస్తుతం ఉన్న సీపీఎస్, జీపీఎస్ విధానాలను రద్దు చేయాలని కోరుతూ డిసెంబరు 10న విజయవాడ నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనిరెడ్డి నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం ఛలో విజయవాడ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఏపీసీపీఎస్‌ఈఏ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవాధ్యక్షుడు సీహెచ్ ప్రసాద్, అసోసియేట్ అధ్యక్షుడు జీవీవీ లక్ష్మీనారాయణ, ఆర్థిక కార్యదర్శి యం.చంద్రరావు, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్.రాజు, యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాకు చర్యలు



పడమరవిప్పర్రు గ్రామంలో తాగునీటి శుభ్రత కోసం క్లోరినేషన్ పరీక్షలు చేయిస్తున్న దృశ్యం

పెంటపాడు: పడమరవిప్పర్రు గ్రామంలో తాగునీటి నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ తెంటు జయలక్ష్మి, కార్యదర్శి శోభన్‌కుమార్ తెలిపారు. బుధవారం గ్రామంలో రాజుల చెరువు ప్రాంతంలో ఓహెచ్ఆర్ వద్ద తాగునీటి శుభ్రతపై సిబ్బందితో కలిసి ప్రత్యేక క్లోరినేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా తూముకు అడ్డుపడిన చెత్తను కూలీలతో తొలగించారు. ఈ సందర్భంగా కార్యదర్శి శోభన్ మాట్లాడుతూ గ్రామంలో పరిశుభ్రతను ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. పంచాయతీ చెత్త రిక్షాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం విమల, హెల్త్ సిబ్బంది నరేంద్ర, ఆరోగ్యశాఖ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూలు బస్సు బోల్తా.. క్లీనర్ మృతి



జాతీయరహదారిపై మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్ : ప్రైవేటు స్కూలు బస్సు తిరగబడి యువకుడు దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన తణుకు జాతీయ రహదారిపై బుధవారం ఉదయం చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం తణుకులోని డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ స్కూలు బస్సు ఖండవల్లి, ముక్కామలలోని విద్యార్థులను తణుకులోని పాఠశాలకు తీసుకొచ్చేందుకు వెళ్తున్న క్రమంలో స్థానిక డీమార్ట్ సమీపంలోకి వచ్చే సరికి బస్సు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న మరో ప్రైవేటు స్కూలు బస్సు క్లీనర్ మేకం ప్రవీణ్ కుమార్ ఘటనా ప్రాంతంలోనే మృతిచెందాడు. ఉండ్రాజవరం జంక్షన్‌లో బస్సు ఆపి లిఫ్ట్ అడిగి ఎక్కిన వ్యక్తి కిలో మీటరు వ్యవధిలోనే ప్రమాదంలో మృతిచెందడం ఆ కుటుంబంతోపాటు స్థానికులను కలచివేసింది. విద్యార్థులను తీసుకువెళ్లేందుకు వెళ్తుండడంతో బస్సు ఖాళీగా ఉందని, అదే పిల్లలు ఉండి ఉంటే ఎంతటి పెనుప్రమాదం జరిగేదోనని స్థానికులు భయాందోళన చెందారు. ప్రమాదంలో బస్సు డ్రైవర్ జి.రాంబాబు, క్లీనర్ టి.తాతారావు సురక్షితంగా బయటపడ్డారు. మృతదేహాన్ని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ప్రవీణ్‌కుమార్ తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

లారీని ఢీకొని విద్యార్థి మృతి

పెంటపాడు: చదువుకొన్న ధ్రువపత్రాల కోసం గూడెం మోటార్ సైకిల్‌పై వస్తున్న ఒక విద్యార్థి లారీ ఢీకొని మృతి చెందాడు. పెంటపాడు ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం కొవ్వూరు మండలం మద్దూరుకు చెందిన భట్టు నాగేశ్వరరావు (19) తన స్నేహితుడితో కలిసి స్వగ్రామం నుంచి గూడెం ఆదిత్య కళాశాలకు వెళుతున్నాడు. అయితే ప్రత్తిపాడు త్రిపుల్ ఎఫ్ కర్మాగారం వద్దకు వచ్చేసరికి మలుపు తిరుగుతున్న లారీని వెనుక నుంచి అనుకోకుండా ఢీకొట్టడంతో నాగేశ్వరరావు అక్కడి కక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. నాగేశ్వరరావు తండ్రి దుర్గారావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాపు చేపట్టామని ఎస్సై స్వామి తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బస్సు సర్వీసులు, కార్గో సేవలపై వినియోగదారులు, ప్రయాణీకులు తమ అభిప్రాయాలను, సూచనలను, సలహాలను, ఫిర్యాదులు తెలపాలని ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి కోరారు. ఈ నెల 21వ తేదీ గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్యలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని ప్రయాణీకులు, వినియోగదారులు 99592 25488 నెంబర్‌కు ఫొన్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం సామాజిక బాధ్యత

తాడేపల్లిగూడెం రూరల్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించాలని పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం అన్నారు. బుధవారం మండలంలోని పెదతాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వరల్డ్ టాయ్‌లెట్స్ డే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నవరం మాట్లాడుతూ బహిరంగ మల విసర్జనను విడనాడాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ సోమేశ్వరరావు, ఏఈ రాజా శ్రీనివాస్‌లు మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం మరుగుదొడ్లు వినియోగించిన తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు షేక్ లాల్ బీబీ, గ్రామ కార్యదర్శి తల్లాప్రగడ రవిచంద్, జేఏబీసీ రఘు, వెల్ఫేర్ అసిస్టెంట్ సురేష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన

తాడేపల్లిగూడెం రూరల్: దోమల నివారణ అందరి సామాజిక బాధ్యత అని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు అన్నారు. బుధవారం మండలంలోని పట్టింపాలెం గ్రామంలో కీటక జనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వెక్టార్ కంట్రోల్, హైజీన్ కార్యక్రమాలను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమ లార్వాలు ఉన్న ప్రదేశాలను గుర్తించి నాశనం చేయాలన్నారు. అనుమానిత జ్వర కేసులకు పరీక్షలు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామ ఆరోగ్య కార్యదర్శులు పద్మ, శాంతకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సహాయకులు కాంతారావు, తాతాజీ, కమలాకర్, పంచాయతీ కార్యదర్శి కే.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న చదరంగం పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వెస్ట్‌గోదావరి చెస్ అసోసియేషన్, మాస్టర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ అండర్ -13 ఓపెన్ అండ్ గర్ల్స్ చదరంగం పోటీలు రెండోవ రోజు బుధవారం నిర్వహించారు. స్పాన్సర్ సింగం పట్టాభి జానకమ్మల సేవా ట్రస్ట్ పోటీలకు సహకరించారు. రెండోవ రోజు పోటీలకు ముఖ్యఅతిథిగా సింగం సుబ్బారావు పోటీలను పర్యవేక్షించారు. 5 పాయింట్లుకు 5 పాయింట్లు సాధించిన కె.భావన (ఎన్‌టీఆర్‌జిల్లా), ఎ.హేమవర్షన్ (నెల్లూరు), అఖిల్ ప్రసాద్, (విశాఖ) శామ్యూల్ స్టీఫెన్ (అనంతపురం) జి.నయన (విశాఖ), శ్రావ్యశ్రీ (అనకాపల్లి), అముక్త (ప్రకాశం) తదితరులు విజేతలుగా నిలిచారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



తాడేపల్లిగూడెం: విశాఖ, విజయవాడ మార్గంలో బాదంపూడి చేబ్రోలు రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి బుధవారం మృతి చెందినట్టు తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై పి.అప్పారావు తెలిపారు. మృతుని వయస్సు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. నలుపు, తెలుపు రంగు నిలువు అడ్డచారల హాఫ్ హ్యాండ్స్ చొక్కా, పింక్ కలర్ జాకెట్, బ్రౌన్ కలర్ కాటన్ ప్యాంటు ధరించి ఉన్నట్టు తెలిపారు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిస్తే ఫోన్ నెంబర్ 99480 10061కు సమాచారం అందించాలని కోరారు.

దేశ ఆర్థిక వ్యవస్థలో యువత కీలకం

తాడేపల్లిగూడెం: దేశ ఆర్థిక వ్యవస్థలో యువతే కీలకమని ప్రముఖ ఇంజనీర్, సామాజిక కార్యకర్త డాక్టర్ సురేష్ నాయక్ అన్నారు. ఏపీ నిట్‌లోని శ్రేష్ఠ క్లబ్ సహకారంతో ద రోల్ ఆఫ్ టెక్నోక్రాట్స్ ఇన్ వికసిత్ భారత్ అనే అంశంపై బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ నాయక్ మాట్లాడుతూ దేశ స్థితిని, గతిని మార్చే సత్తా యువతరానికే ఉందన్నారు. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్నది ప్రధాని నరేంద్రమోదీ లక్ష్యమని, కలను సాకారం చేయడంలో విద్యార్థులు, సాంకేతిక నిపుణుల పాత్ర ఎంతో ఉందన్నారు. ప్రతి విద్యార్థి తన ఆలోచనలకు పదునుపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్‌కె .శాస్త్రి ఆచార్యులు కార్తికేయశర్మ, వి.సందీప్,క్లబ్ కార్యదర్శి బి.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

